

ప్రజా సమస్యలపై చర్చించేందుకు
సిద్ధమని పలుమార్లు చెప్పినా జగన్,
వైసీపీ నేతలు స్పందించడం లేదు.
ఐదేళ్లలో చేయని అభివృద్ధిని కూటమి
ప్రభుత్వం 20 నెలల్లో సాధించింది.
శాసనమండలిలో చర్చకు రాకుండా వైసీపీ
సభ్యులు సభను అడ్డుకుని
వెళ్లిపోతున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 03.03.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 33 సంచిక - 315 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## సమర్థ పాలనకు అన్ని శాఖల్లోనూ ఏఐ వినియోగం

### డ్రోన్, సీసీ టీవీ, శాటిలైట్ డేటా సమీకృతం చేసే మెకానిజం

### వేసవి దృష్ట్యా ఆర్టీసీ బస్టేషన్లలో తాగునీటిపై శ్రద్ధ పెట్టండి

### ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్షన్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత మరింత పెంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... వివిధ అంశాలపై చర్చించారు. డ్రోన్, సీసీ టీవీ కెమేరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి... వినియోగించుకునేలా ఒక మెకానిజం తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. మిగతా 2లో...



## భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది

### కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నేతో మన ప్రధాని నరేంద్ర మోదీ



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే ఇండియా నిశ్చితాభిప్రాయమని అన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నేతో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో ప్రధాని మాట్లాడారు.

ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, రాడికలైజేషన్ మనకే కాక ప్రపంచ దేశాలకు సవాళ్లు విసురుతున్నట్టు చెప్పారు. దీనిపై సమష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి బెదిరింపులను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని అన్నారు. మిగతా 2లో...



## రాష్ట్రాలకు కేంద్రం హై అలర్ట్




**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ దాడులు, ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. యుద్ధవాతావరణం నేపథ్యంలో భారతదేశంలో మతపరమైన అల్లర్లు జరిగే అవకాశం ఉందని అందువల్ల అలర్ట్‌గా ఉండాలని ఈ మేరకు కేంద్ర హోం శాఖ రాష్ట్రాల పోలీసు శాఖలకు లేఖ రాసింది. ముఖ్యంగా మతపరమైన సభలు, ప్రార్థనా స్థలాలలో ఇరాన్ అనుకూల రాడికల్ బోధకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం అటువంటి వాటిపై నిఘా ఉంచాలని ఆదేశించింది. దేశీయంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, గూఢచారి విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది.

**భారత్‌లో నిరసనలపట్ల అప్రమత్తం:** ఖమేనీ మృతికి నిరసనగా భారత్ లోని ముఖ్యమైన నగరాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్, కర్నాటక, ఢిల్లీ, యూపీతో పాటు పలు ముఖ్యమైన నగరాల్లో ఖమేనీ మృతిపై ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలను ఆసరాగా చేసుకుని కొంత మంది హింసాత్మక ఘటనలకు దారి తీసేలా రెచ్చగొట్టే అవకాశం ఉందని, దీనిని అదుపు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా జాగ్రత్త వహించాలంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇదిలా ఉంటే పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అలర్ట్ గా ఉంది అక్కడి పరిస్థితులపై గత రాత్రి ప్రధాని మోడీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమీక్షించింది.

## గల్ఫ్ దేశాధినేతలకు ప్రధానిమోదీ ఫోన్



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** యుద్ధ వాతావరణం మరింత ముదురుతున్న వేళ గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేశారు. ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై చర్చించారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల నేతలకు కీలక సూచనలు చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు అత్యంత ఆందోళనకరమని పేర్కొన్న మోదీ, భారత్ ఎప్పుడూ శాంతినే కాంక్షిస్తుందని స్పష్టం చేశారు. "ఎటువంటి వివాదాలనైనా దౌత్యపరమైన చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ గట్టిగా విశ్వసిస్తుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. మిగతా 2లో...

## అమరావతి పనులు ఆలస్యం..

- మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి నిర్మాణ పనుల్లో ఆలస్యంపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా పూర్తి చేయాలని, చేయలేకపోతే వెళ్లిపోవాలని అసహనం వ్యక్తం చేశారు. అమరావతిలో గెజిటెడ్ అధికారులు కోసం క్వార్టర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పనులను షాపూర్ జీ పల్లోంజీ కన్ స్ట్రక్షన్ సంస్థ ఆలస్యంగా నిర్మిస్తోంది. దీంతో మంత్రి నారాయణ ఈ పనులను పరిశీలించారు. పనులు ఆలస్యంపై అక్కడ పని చేస్తున్న ఇద్దరు ప్రతినిధులపై మండిపడ్డారు. అమరావతి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మిగతా 2లో...

## యుద్ధం కారణంగా వివిధ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వ సహాయం


- ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్‌కు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్రంతో సమన్వయం చేసుకుని, పౌరులు సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమాసియాలో తలెత్తిన యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై ఆర్టీజీఎస్ అధికారులు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ తదితర దేశాల్లోని రాష్ట్ర ప్రజలు యుద్ధం కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఇందుకోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అక్కడ చిక్కుకుపోయిన వారిని సంప్రదించి, తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. సహాయక చర్యల విషయంలో ఏపీ ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్ కలిసి పనిచేయాలని, నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు సీఎం చెప్పారు. కేంద్రం ద్వారా ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరిపి, అందరూ సురక్షితంగా ఉండేలా చూడాలని చెప్పారు. మిగతా 2లో...

## లిక్కర్ కుంభకోణం ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయాలి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో 2019–2024 మధ్య అమలైన లిక్కర్ పాలసీలో భారీ ఆర్థిక కుంభకోణం చోటుచేసుకుందని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి ప్రధాన సూత్రధారిని తక్షణమే అరెస్ట్ చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. 'జనతా వారధి' కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, వార్డుల్లో పర్యటించిన సమయంలో ప్రజల నుంచి లిక్కర్ పాలసీకి సంబంధించిన అనేక ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. 2019–2024 మధ్య అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ప్రభుత్వం మద్యం విక్రయాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి, అనుకూల సంస్థలకు మాత్రమే అనుమతులు ఇచ్చి, నాణ్యతలేని మద్యం విక్రయాలకు ప్రోత్సాహం కల్పించిందని ఆరోపించారు. ఈ విధానాల కారణంగా వేలాది కుటుంబాలు ఆర్థిక, సామాజికంగా నష్టపోయాయని, యువత భవిష్యత్తు దెబ్బతిన్నదని, లివర్ సంబంధిత మరణాలు పెరిగాయని పేర్కొన్నారు. ఎక్సైజ్ ఆదాయం 2019–20లో రూ.17,000 కోట్లకు పైగా ఉండగా, 2022–23లో రూ.23,000 కోట్లకు, 2024–25లో రూ.28,000 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ పెరుగుదలలో జరిగిన వ్యత్యాసం ఎక్కడికి వెళ్లిందో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. మిగతా 2లో...


## లోపలి పేజీల్లో

### మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత

- విజయవాడలో మహిళా భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహణ
- సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ
- ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది
- మహిళ భద్రత సమాజ భద్రతకు మూలస్తంభం
- ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలి
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబుదేలి... హోం మంత్రి అనిత

### వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుతో రైతులకు భారీ ఊరట

- సీఎం చంద్రబాబు, మంత్రి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు


## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు

- ఏపీ ఎన్నార్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశామన్న మంత్రి
- హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని కోరిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇజ్రాయిల్ – ఇరాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం కారణంగా, గల్ఫ్ దేశాలలో నెలకొన్న, పరిస్థితుల నేపథ్యంలో ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని, రాష్ట్ర ఎన్.ఆర్.ఐ సాధికారిత వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆయా దేశాల్లో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా కొన్ని విమానాశ్రయాలలో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మిగతా 2లో...

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** అమెరికా – ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌తో యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేశారు. ఇరాన్‌తో యుద్ధం, తాజా పరిణామాలపై నెతన్యాహుతో చర్చించారు. శాంతి దిశగా చర్యలు తీసుకోవాలని మోదీ కోరారు. ఫోన్ సంభాషణల తాలూకా విషయాలపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా సోమవారం ఓ పోస్టు పెట్టారు.

ఆ పోస్టులో.. 'ప్రస్తుత పరిస్థితులపై చర్చించేందుకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో టెలిఫోన్‌లో మాట్లాడాను. తాజా పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తోందని చెప్పాను. పౌరుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నాను. యుద్ధాన్ని త్వరితగతిన నిలిపివేయాల్సిన అవసరాన్ని భారత్ పునరుద్ఘాటిస్తోంది' అని రాసుకొచ్చారు. మిగతా 2లో...

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్

## జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు




- ఫిబ్రవరిలో రూ. 3,061 కోట్ల ఆదాయం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నికర జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం వృద్ధి నమోదు చేసింది. 2017లో జీఎస్టీ అమలైనప్పటి నుంచి చూస్తే ఈ ఏడాది ఫిబ్రవరి నెల వసూళ్లు అత్యధికంగా ఉన్నాయి. గతేడాది ఇదే నెలలో వసూలైన నికర జీఎస్టీ రూ. 2,902 కోట్లు కాగా ఈ ఏడాది వసూళ్లు రూ. 3,061 కోట్లు. ఈ లెక్కన జీఎస్టీ గతేడాది కంటే రూ. 159 కోట్లు అదనంగా వసూలైంది. మిగతా 2లో...

## సమర్థ పాలనకు అన్ని శాఖల్లోనూ ఏఐ వినియోగం



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్ స్టేషన్లలో తాగునీటికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా జరిగేలా పరిస్థితులు ఉండాలన్నారు. అటు పెన్షన్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా, అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి తప్ప, పదేపదే ఒకేరకమైన సమాచారం కోసం ప్రజలను, ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మరోవైపు రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కి పెంచినట్టు తెలిపారు. అయితే వీటన్నింటినీ సులభంగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం చెప్పారు.

## భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుంది

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచవ్యాప్త ఉద్రిక్తతల విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒకటేనని, శాంతి, సుస్థిరత కీలకమని, రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేస్తే శాంతి మరింత పటిష్టమవుతుందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయులు ఎక్కడున్నా వారితో ఎప్పుడూ సంప్రదింపులు జరుపుతూ వారి భద్రతకు భారత్ కట్టుబడి ఉంటుందని చెప్పారు.

అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గత శనివారంనాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని 30 చోట్ల దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్, అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ శాంతియుత పరిష్కారాని పిలుపునిచ్చారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్ పర్యటనకు విచ్చేయడంతో విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కూడా కెనడా నిర్ణయం తీసుకుంది.

## గల్ఫ్ దేశాధినేతలకు ప్రధానిమోదీ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్లిష్ట సమయంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల్లో ఉన్న వేలాది మంది భారతీయ పౌరుల భద్రత గురించి ప్రధాని ప్రస్తావించారు. వారి క్షేమాన్ని పర్యవేక్షించేందుకు మరియు రక్షణ కల్పించేందుకు ఆయా దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయుల భద్రత తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడించారు.

ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఉగ్రవాదం కేవలం భారత్, కెనడాలకే కాకుండా మొత్తం మానవాళికే పెను సవాలుగా మారిందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. వీటిని అణచివేసేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.

## అమరావతి పనులు ఆలస్యం..

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చూస్తుంటే.. తమరెందుకు ఆలస్యం చేస్తున్నారంటూ నిలదీశారు. షాపూర్ జీ పల్లోంజీ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వెంటనే పంపాలని సూచించారు. అలాగే తమ మేనేజ్‌మెంట్ వచ్చి సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడాలని, పనుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించారు.

## మంత్రి కందుల దుర్గేష్ కృషితో పిట్టల వేమవరానికి సీసీ రోడ్డు మంజూరు



- **యర్రాయిచెరువు - పిట్టల వేమవరం రహదారికి రూ. 1.30 కోట్లు కేటాయిస్తూ పరిపాలన అనుమతులు జారీ**
- **నిడదవోలు నియోజకవర్గంలో రోడ్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**
- **ఇచ్చిన హామీలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్న మంత్రి దుర్గేష్..హర్షం వ్యక్తం చేసిన ప్రజలు**

నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) : నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చొరవతో మరో కీలక మౌలిక సదుపాయాల పనులకు మోక్షం లభించింది. నియోజకవర్గ పరిధిలోని యర్రాయిచెరువు నుండి పిట్టల వేమవరం వరకు నిర్మించ తలపెట్టిన 1.1 కి.మీ. పొడవైన సీసీ రోడ్డుకు కూటమి ప్రభుత్వం రూ. 1.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న జిల్లా ప్రధాన రహదారులు మరియు రాష్ట్ర రహదారులను మెరుగుపరిచే క్రమంలో భాగంగా, ఆర్ అండ్ బీ శాఖ సోమవారం జీవో ఆర్టీ నంబర్ 115ను విడుదల చేసింది. మంత్రి కందుల దుర్గేష్ పంపిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఈ నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. "నిడదవోలు నియోజకవర్గంలోని రోడ్ల సమస్యలకు స్వస్తి పలకడమే మా లక్ష్యం. ఇప్పటికే మరిన్ని ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి, త్వరలోనే అవి కూడా ఆమోదం పొందుతాయి. నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం" అని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు కావడం పట్ల పిట్టల వేమవరం గ్రామస్థులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లనాటి సమస్యను పరిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలుపుతూ, "ఇది నిజంగా మంచి ప్రభుత్వం" అని వారు కొనియాడారు.

# జీఎస్టీ వసూళ్లలో సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి)




జీఎస్టీ వసూళ్లలో రికార్డు: ప్రధాన సరుకులు, వినియోగ వస్తువులు, ఔషధాలు, సిమెంట్‌పై పన్ను రేట్లు తగ్గినా జీఎస్టీ 2.0 సంస్కరణ వల్ల జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ ఉపసంహరణ జరిగినా నికర వసూళ్లలో ఏపీ ప్రభుత్వం వృద్ధినే నమోదు చేసింది. పన్నురేటు తగ్గింపులు, వ్యూహాత్మక విధాన చర్యలు, మెరుగైన విధానాల వల్ల వినియోగం పెరగటం రాష్ట్ర ఆదాయ వృద్ధికి దోహదపడిందని రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు.ఎ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నికర జీఎస్టీ వసూళ్లు రూ. 3,061 కోట్ల రూపాయలకు చేరాయి. అనేక వస్తువుల పన్ను తగ్గించినప్పటికీ వసూళ్లు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వరుసగా 11 నెలల పాటు జీఎస్టీ నికర వసూళ్లు అధికంగా నమోదయ్యాయి.

వసూళ్లలో అధిక వృద్ధి నమోదు: వివిధ వస్తువులపై పన్ను రేట్లు తగ్గినప్పటికీ 2025 ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే నెట్ జీఎస్టీ వసూళ్లలో 5.45 శాతం మేర వృద్ధి నమోదైంది. ప్రతినెలా క్యుమిలేటివ్ జీఎస్టీ వసూళ్లతో దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ 2025-26లో మొదటి స్థానంలో ఉంది. పన్ను రేట్ల తగ్గింపు, పొగాకు, మద్యం, విలాసవంతమైన వస్తువుల మినహా మిగిలిన వస్తువులపై సెస్సు మినహాయించిన తర్వాత 2026 ఫిబ్రవరిలో గ్రాస్ జీఎస్టీ కింద 3వేల562 కోట్లు వసూలైంది. అది 2025 ఫిబ్రవరిలో రూ. 3.569 కోట్ల రూపాయలుగా ఉంది. పన్ను రేట్ల తగ్గింపు, అన్ని ఉత్పత్తులపై సెస్ ఉపసంహరణ ప్రభావంతో స్వల్పంగా 0.22 శాతం తగ్గింది. ఆంధ్రప్రదేశ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే స్థిరమైన, సగటు కన్నా జీఎస్టీ వసూళ్లలో అధిక వృద్ధిని నమోదు చేస్తోంది.

గత ఏడాది ఫిబ్రవరిలో జీఎస్టీ వసూళ్లతో పోలిస్తే ఎస్‌జీఎస్టీ వసూళ్లలో 2.96 శాతం పెరుగుదల నమోదై మొత్తం రూ. 12,051 కోట్లకు చేరింది. కేంద్రం ఐజీఎస్టీ సెటిల్‌మెంట్‌లో 7.27 శాతం పెరుగుదలతో మొత్తం రూ. 18,9.85 కోట్లు వచ్చింది. పెట్రోలియం వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం రూ. 1442 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 3.06 శాతం పెరుగుదల నమోదయ్యింది. ప్రొఫెషనల్ ట్యాక్స్ ద్వారా వచ్చే ఆదాయంలో 31.97 శాతం పెరిగింది. వాణిజ్య పన్నుల శాఖ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను గుర్తించడంలో చేసిన కృషి కారణంగా ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ కింద కేంద్రం నుంచి వచ్చే మొత్తం పెరిగింది.

ఆదాయ వృద్ధి రేటు 4.63 శాతం: రాష్ట్రం గతంలో పడిపోతున్న జీఎస్టీ వసూళ్లను ఆపడమే కాకుండా 2026 ఫిబ్రవరిలో 4.63 శాతం వృద్ధిని సాధించింది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు క్యుమిలేటివ్ పెరుగుదల 4.77 శాతంగా నమోదైంది. వసూళ్లు కఠినతరం చేయడం, తప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లు నియంత్రించడం, కేంద్రం నుంచి ఐజీఎస్టీ సెటిల్‌మెంట్‌లో కచ్చితత్వంతో ఇది సాధ్యమైంది. ఫిబ్రవరిలో అన్ని సెక్టార్ల నుంచి వసూళ్లు రూ. 4,634 కోట్లు. గత ఏడాది ఇదే కాలానికి వసూలైన మొత్తం రూ. 4,428 కోట్లు. గత ఏడాదితో పోలిస్తే అన్ని సెక్టార్లలో కలిపి ఆదాయ వృద్ధి రేటు 4.63 శాతంగా ఉంది.

కేసుల పరిష్కారంలో చురుకైన పాత్ర: పన్ను ఎగవేత, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్‌లలో నిబంధనలు కఠినతరం చేయడం, అంతర్ రాష్ట్ర లావాదేవీలకు సంబంధించి రిటర్న్‌లు ఫైలింగ్‌ల వ్యత్యాసాన్ని గుర్తించేందుకు డేటా విశ్లేషణ, ఏఐ వినియోగించడం వంటి చర్యలు వసూళ్లు పెంచేందుకు దోహదపడ్డాయి. ఆడిట్‌లు దర్యాప్తులు వేగంగా పూర్తి చేయడం, అంతర్ రాష్ట్ర లావాదేవీలను గుర్తించి ఐజీఎస్టీ చెల్లించేలా చూడటం, నిర్దేశిత వ్యవధిలోగా రిటర్న్‌లు కచ్చితమైన వివరాలతో ఫైల్ చేసేలా వ్యాపారులను ప్రోత్సహించడం వంటివి సత్ఫలితాలనిచ్చాయి.

పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ, దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంలో ప్రభుత్వం చురుకైన విధానాన్ని అమలు చేస్తోంది. వారి ఆస్తులు, బ్యాంకు ఖాతాలను గుర్తించి నిబంధనల మేరకు రికవరీ చేసేలా చర్యలు చేపట్టింది.

# మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత




విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : మహిళా భద్రత వారోత్సవాల సందర్భంగా విజయవాడ సత్యనారాయణపురం సిగ్నల్ నుండి శివాజీ గేటు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఐజి రాజకుమారి, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎస్పీ సరిత, ఈగల్ ఎస్పీ నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో మహిళా భద్రతపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత 'శక్తి టీమ్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గినట్లు వెల్లడించారు.

ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, మహిళ సాధికారత సాధిస్తే కుటుంబం మొత్తం సాధికారత సాధించినట్లేనని చెప్పారు. మహిళ భద్రత సమాజ భద్రతకు మూలస్తంభమని, మహిళా అభివృద్ధి దేశ అభివృద్ధికి కొలమానమని పేర్కొన్నారు.

ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా పెంచాలని, ఆడపిల్లలతో పాటు మగపిల్లలను కూడా బాధ్యతాయుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి ఆడపిల్లను తల్లి, సోదరి భావనతో గౌరవించాలని, మహిళల పట్ల గౌరవం ఇంటి నుంచే ప్రారంభమవ్వాలని అన్నారు.


పిల్లలకు కోట్ల ఆస్తి కంటే సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, పరిష్కార శక్తి ఇవ్వడం ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. ఒక తల్లి ప్రసవ వేదనను మాటల్లో చెప్పలేమని, మహిళల శక్తి అపారమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్త్రీల పక్షపాతిగా ఉన్నారని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆస్తుల్లో మహిళలకు సమాన వాటా తీసుకువచ్చినది తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు అని గుర్తుచేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై 'సెక్సువల్ అఫెండర్ షీట్' ఓపెన్ చేసి, కఠిన నిఘా ఏర్పాటు చేస్తామని హోం మంత్రి స్పష్టం చేశారు. మహిళలను గౌరవిస్తూ అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుతో రైతులకు భారీ ఊరట



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు గొప్ప ఊరట కలిగించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. మొత్తం 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దశలవారీగా మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 6,593, ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,926, ఈపిడీసీఎల్ పరిధిలో 27,594 కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు తన విజ్ఞప్తికి వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్షన్ల మంజూరుతో రైతులకు సాగునీటి భద్రత లభించి, పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో అనేక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఇప్పుడు ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చి పరిష్కరించడం రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, సాగునీటి వనరులను మెరుగుపరచడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం తీసుకునే ప్రతి నిర్ణయం వారి భవిష్యత్తుకు భరోసా కలిగించే విధంగా ఉంటుందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు.

## లిక్కర్ స్కాంపై విచారణకు గుంటూరు బీజేపీ డిమాండ్




గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో 2019-2024 మధ్యకాలంలో జరిగిన లిక్కర్ స్కాం, అవినీతి ఆరోపణలు, కల్తీ మద్యం ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సోమవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'జనతా వారధి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సారథ్యంలో ప్రతినిధులు కలెక్టర్‌ను కలిసి, వైసీపీ పాలనలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న మద్యం కుంభకోణం, కల్తీ మద్యం తాగి వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా త్వరితగతిన విచారణ జరిపించాలని కోరారు. సొంత డిస్టిలరీలను ఏర్పాటు చేసి నకిలీ మద్యం విక్రయాలు జరిపి, ఆన్‌లైన్ లావాదేవీలకు బదులుగా నగదు రూపంలో డబ్బులు సేకరించి ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారనే ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా మద్యం ఘటనల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు వితంతు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, బీమా నగదు మంజూరు చేయాలని కోరారు.

కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్ తోట శ్రీనివాస్, కో కన్వీనర్లు కత్తి మేరీ సరోజినీ, మార్తా నరేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు సురేష్ జైన్, నారాయణరెడ్డి, మండలాధ్యక్షులు దత్తు ప్రసాదు, లక్ష్మణ్ గౌడ్, అబ్రహం, నాయకులు ఏసోబు, వక్కలగడ్డ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత శాఖ మంత్రిగా తాను ఎప్పటికప్పుడు పరిస్థితి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్నార్టీ) ఇబ్బందుల్లో ఉన్న ప్రవాసాంధ్రులకు అవసరమైన సహాయం చేసేందుకు గాను, గల్ఫ్ దేశాలలో ఉన్న ఏపీ ఎన్నార్టీ కోఆర్డినేటర్లను అప్రమత్తం చేసి, స్థానికంగా ఉన్న తెలుగు కుటుంబాల సహకారంతో తాత్కాలిక వసతి, భద్రత మరియు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏపీ ఎన్నార్టీ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని మానిటర్ చేస్తూ, కోఆర్డినేటర్లతో సంప్రదింపులు జరుపుతున్నారని మంత్రి తెలిపారు.

స్థానికంగా ఉన్న ఇండియన్ ఎంబసీ సేవలను, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు తమ వివరాలను క్రింది ఏపీ ఎన్నార్టీఎస్ 24/7 హెల్ప్ లైన్ 0863-2340678, వాట్సాప్: +91 85000 27678 నెంబర్లకు తెలియజేయవచ్చని, ఈమెయిల్: helpline@apnrts.com లకు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు వెంటనే సంప్రదించి సహాయం పొందవలసిందిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శనక్కాయల రాధామాధవి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా 'మహిళా పంచకం' పేరుతో వారం పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మహిళా ఆరోగ్యం, విద్య, ఉపాధి, రక్షణ, ధ్యానం, ఆత్మశక్తి, గర్భధారణ, పోషణ వంటి అంశాలపై అవగాహన సదస్సులు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం సమగ్ర చర్యలు తీసుకోవడం లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బజరంగ్ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి హో పావని, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉ. విమలాదేవి, కటారి పద్మజ, రమాదేవి, సాదువాణి, విజయలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, లీలారేఖ, చి. స్రవంతి, ఉషారాణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు. మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ కటారి పద్మజ కార్యక్రమ వివరాలను వెల్లడించారు.

## యుద్ధం కారణంగా వివిధ దేశాల్లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలకు ఏపీ ప్రభుత్వ సహాయం

(మొదటి పేజీ తరువాయి)

వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఎయిర్ పోర్టులు మూసివేయడం, విమాన సర్వీసుల రద్దుతో వెంటనే రాష్ట్రానికి తిరిగి వచ్చే పరిస్థితులు లేనందున, పరిస్థితులు చక్కబడేవరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, దీనికి ఏపీ ఎన్ఆర్టీ సహకరిస్తుందని సీఎం చెప్పారు.

**హెల్ప్ లైన్ నెంబర్ 0863-2340678 :** గల్ఫ్ దేశాల్లో రాష్ట్ర ప్రజల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎన్ఆర్టీతో కలిసి చర్యలు చేపట్టింది. వారికి సహాయం కోసం 0863-2340678 హెల్ప్ లైన్ నెంబర్, 85000 27678 వాట్సప్ నెంబర్‌ను 24 గంటలు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏపీ ఎన్ఆర్టీ కో ఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు. ప్రవాసాంధ్రులు సంప్రదించిన వెంటనే ఏపీ ఎన్నార్టీ వారికి తక్షణం సహాయ, సహకారాలు అందించేలా ఏర్పాట్లు చేసింది. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటు helpline@apnrts.com, support@apnrts.com, info@apnrts.com ఈ మెయిళ్లు, https://apnrts.ap.gov.in వెబ్సైట్‌ను కూడా సంప్రదించవచ్చు. ఈ సమీక్షలో ఆర్టీజీఎస్ అధికారులు, ఎన్ఆర్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ప్రధాని మోదీ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

**ఇరాన్ దాడులపై గల్ఫ్ దేశాల సమావేశం :** ఇరాన్ దాడులపై గల్ఫ్ దేశాలు సమావేశం నిర్వహించాయి. యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా విదేశాంగ మంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'ఇరాన్ దాడులను చూస్తూ ఊరుకోం. మమ్మల్ని మేం రక్షించుకుంటాం. దేశాలు ఇరాన్‌పై తిరిగి దాడి చేసే హక్కుమాకు ఉంది. మా పౌరుల రక్షణకు చర్యలు తీసుకుంటాం' అని గల్ఫ్ దేశాలు తేల్చి చెప్పాయి.

## లిక్కర్ కుంభకోణం ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా కొనుగోళ్లు, సరఫరా, విక్రయాలు కేంద్రీకరించి, ఔట్‌సోర్సింగ్ పేరిట అనుకూల వ్యక్తులను నియమించి అవినీతి జరిగిందని ఆరోపించారు. నగదు లావాదేవీల ద్వారా బ్లాక్ మనీ మళ్లించారని, డిస్టిల్లరీలను స్వాధీనం చేసుకుని సొంత బ్రాండ్ల తయారీ, విక్రయాల ద్వారా భారీగా అక్రమ లాభాలు పొందారని అన్నారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ దాఖలు చేసిన 305 పేజీల చార్జ్ షీట్‌లో రూ. 3,200-3,500 కోట్ల కుంభకోణంలో 'బిగ్ బాస్' పాత్ర కీలకమని ప్రస్తావించబడిందని తెలిపారు. మొత్తం సొమ్ములో 90 శాతం ప్రధాన సూత్రధారికి చేరిందని, ప్రతి నెల రూ. 50-60 కోట్ల ముడుపులు అందినట్లు పేర్కొన్నారని తెలిపారు. విజయవాడ ఏసీబీ కోర్టు ఆస్తుల అటాచ్‌మెంట్‌కు ఆమోదం తెలిపిందని, 48 మందిపై కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్ట్ చేశారని, రూ. 62.86 కోట్ల ఆస్తులను సీజ్ చేశారని వివరించారు. అయితే సీజ్ చేసిన ఆస్తుల విలువ తక్కువగా ఉండటంతో నిందితులకు పెద్దగా నష్టం కలగలేదని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో 2019-2024 లిక్కర్ పాలసీపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేసి విచారించాలని, అవినీతి ద్వారా సంపాదించిన ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని, అమ్మకాలు, టర్నోవర్, పన్నులు, డిస్టిల్లరీ ఒప్పందాలపై వైట్ పేపర్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారతీయ జనతా పార్టీ తరపున పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. ప్రజల డబ్బుకు జవాబుదారీతనం ఉండాలని, నిజం బయటపడే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేత

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా కారుణ్య నియామకాల క్రింద 9 మందికి సోమవారం.నియామక పత్రాలు అండ జేశారు. వీరిలో ఆర్. వెంకట సుబ్బారావు, జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ సెకండరి హెల్త్ డిపార్ట్మెంట్ ఎం. శ్యామ్ కుమార్ , జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ ఎం. సంజయ్ , జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, రెవెన్యూ డిపార్ట్మెంట్ వి. షారోన్ బాబు, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, ట్రాన్స్ పోర్ట్ డిపార్ట్మెంట్

బి. విజయ్ కుమార్ , జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, పోలీస్ డిపార్ట్మెంట్ జే నాగేంద్ర బాబు , జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, పోలీస్ డిపార్ట్మెంట్

సి. హెచ్ అనిల్ కుమార్, జూనియర్ ఆడిటర్, స్టేట్ ఆడిట్ దేవరపల్లి యోగేష్ , జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, ల్యాబార్ డిపార్ట్మెంట్ పులి లక్ష్మయ్య, జూనియర్ ఆడిటర్, స్టేట్ ఆడిట్ లకు నియామక పత్రాలు అందజేసి విధులు అంకిత భావంతో నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.



## మామిడి తోటల గురించి

# శాసనసభలో చర్చ జరగాలి

### రైతు సంఘం నాయకులు డిమాండ్

**మైలవరం, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**

ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు నష్టపోతున్న మామిడి రైతుల గురించి చర్చించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు లు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మైలవరం మండలంలోని పుల్లూరు, మురుసుమల్లి, తదితర గ్రామాలలో ని మామిడి తోటలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా పంట చేతికొచ్చే సమయానికి నల్లి ప్రభావంతో మామిడి రైతులు పెట్టిన పెట్టుబడ ఎలు రాక మామిడిని తొలగించే పరిస్థితులు దాపురించాయన్నారు. గతంలో ఎకరానికి రైతు నుండి 2500 ఇన్సూరెన్స్ కట్టించుకునే వారని నష్టపోయిన రైతుకు ఇన్సూరెన్స్ వచ్చేదని అన్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటా కట్టనందుకే ఇన్సూరెన్స్ రాక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ వెంటనే ఇవ్వాలని, ఎకరానికి 50, వేలు నష్టపరిహారం కింద మామిడి రైతుకు ఇచ్చి ప్రభుత్వమే మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మామిడి రైతులను ఆదుకోకపోతే మరో నాలుగైదు ఏళ్లలో మామిడి కనుమరుగవుతుందని కాబట్టి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు. అధికారులు కూడా ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం వెంకటరెడ్డి, పివి ఆంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు వజ్రాల ధనలక్ష్మి, మైలవరం మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, రెడ్డిగూడెం మండలం రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాధవరెడ్డి, అప్పి రెడ్డి, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సిబ్బందిసంక్షేమానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదే
- అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి
- అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు
- ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ సమస్యను పరిష్కరించాం : హోం మంత్రి అనిత



**అమరావతి, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**

అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని హోంమంత్రి అనిత తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, ముఖ్యంగా సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్‌ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. కూటమి పాలనలో అంగన్వాడీ కేంద్రాల హాజరు శాతం 70 నుండి 96 శాతానికి పెరిగిందని ఆమె తెలిపారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ సమస్యను కూడా ప్రభుత్వం పరిష్కరించిందని, 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే గ్రాట్యుటీ చెల్లింపులకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. అంగన్వాడీ కేంద్రాలకు టీవీలు, ఆర్‌వో యంత్రాలు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు టీచర్లు, ఆయాలకు వేసవిలో 15 రోజుల సెలవులు మంజూరు చేసినట్లు చెప్పారు. చిన్నారుల అభివృద్ధికి ఆటవస్తువులు, పాఠ్య చార్టులు, ఇండక్షన్ స్టవ్‌లు, నాణ్యమైన వంట పాత్రలు అందజేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి పూర్తి స్థాయి వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. అదనంగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనున్నట్లు చెప్పారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన 9 డిమాండ్లను ఇప్పటికే పరిష్కరించామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా సాధ్యమైనంత త్వరగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి వెళ్లిందని ఆరోపించిన మంత్రి, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు మరిన్ని అప్పులు తెచ్చి వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. అయినప్పటికీ ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగులకు భరోసాగా నిలుస్తున్నది కూటమి ప్రభుత్వమేనని హోంమంత్రి అనిత తెలిపారు.

# నిబద్ధతతో జనగణన విధులు నిర్వర్తించాలి

- కచ్చితమైన డేటా సేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పూర్తిస్థాయి అవగాహనకు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి
- క్షేత్రస్థాయిలోనూ శిక్షణ కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**




జనగణన విధులను అత్యంత నిబద్ధతతో, జవాబుదారీతనంతో నిర్వర్తించాలని ఎన్టీఆర్ జిల్లా డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. కచ్చితమైన డేటా సేకరణ దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాదిగా నిలుస్తుందని, అందువల్ల ప్రతి అధికారి, సిబ్బంది తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకుని పనిచేయాలని సూచించారు. ఆదివారం విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలలో సెన్సస్--2027కు సంబంధించిన తొలి దశ (హౌస్ లిస్టింగ్ & హౌసింగ్ సెన్సస్)పై జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ స్థాయి అధికారులకు నిర్వహించిన మూడో రోజు, చివరి శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ (హైదరాబాద్) కార్యాలయ జాయింట్ డైరెక్టర్ జి. ప్రసన్న కుమార్ కూడా కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ద్వారా అధికారులకు సమగ్ర అవగాహన కల్పించబడిందన్నారు. ఇందులో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడమే అసలు విజయమని, అందుకుగాను క్షేత్రస్థాయిలో సిబ్బందికి పగడ్బందీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సారి జనగణన ప్రక్రియ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనుందని తెలిపారు. మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ మాడ్యూల్‌లు, డేటా అప్లోడింగ్ వ్యవస్థలపై సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక లోపాలు, డేటా ఎంట్రీ పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జనాభా లెక్కల సేకరణ రెండు దశల్లో జరుగుతుందని వివరించారు. తొలి దశగా హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ , రెండో దశ పాపులేషన్ ఎన్యూమరేషన్ (పీఈ)లో జనాభా గణాంకాలు నమోదు చేయబడతాయని చెప్పారు. ఈ రెండు దశలు సమగ్రంగా, ఖచ్చితంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. జనగణన ద్వారా లభించే సమాచారం ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు, వనరుల సమర్థ వినియోగానికి కీలకమని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల వంటి రంగాలలో సరైన ప్రణాళిక రూపొందించాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమన్నారు. అందువల్ల అత్యంత పారదర్శకతతో, నిబద్ధతతో, ఎలాంటి వివక్ష లేకుండా సమాచారం సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, సీపీవో వై. శ్రీలత, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏఎస్‌వోలు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య నున్నలో

# శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనారంభం

- నేడు స్వామివారి కల్యాణ మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

**విజయవాడ, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**



విజయవాడ రూరల్ మండలం నున్నలో వేంచేసి ఉన్న 123 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. శైవాగమ సంప్రదాయం ప్రకారం త్రయాహ్నిక దీక్షతో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవి పీఠం పీఠాధిపతి మునీంద్ర మహారాజ్ నేతృత్వంలో, శివాచార్య గూడూరు గోపీకృష్ణ సాన్నిహిత్యంలో గోపూజతో అంకురార్పణ నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, రక్షాబంధనం, దీక్ష స్వీకరణ, అఖండ స్థాపన, స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, తీర్థప్రసాద వినియోగం వంటి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తర్వాత స్వామివారు యాగశాలలో ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు అంగజాల శివయ్య, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. హేమలతా దేవి, ప్రధానార్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ పర్యవేక్షణలో అనేక మంది దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవ మూర్తులకు అంగరంగ వైభవంగా అభిషేకం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే ఆలయ ఈఓ దంపతులు శ్రీ వేణుగోపాలస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తొలి రోజు సాయంత్రం నిత్యార్చన, శాల ప్రవేశం, వాస్తు పూజ, వాస్తు హోమం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజైన సోమవారం శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆరుబయట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ హేమలతాదేవి తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం పొందాలని ఆలయ అధికారులు సూచించారు.

## నియోజకవర్గంలో జనసేన

# పార్టీ టీడీపీ వారి కాళ్ళ కింద నలుగుతుంది

- సభ్యత్వ డ్రైవ్‌పై సీనియర్ నేత పులిపాక ప్రకాష్ ఆవేదన

**జి.కొండూరు, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**



జనసేన కార్యకర్తలకి నాయకులకి ఒక సలహా ఇస్తున్నారంటూ జనసేన సీనియర్ నాయకులు పుల్పాక ప్రకాష్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెంబర్షిప్ డ్రైవ్ లో అత్యుత్సాహం చూపించి పార్టీకి సంబంధం లేని వ్యక్తుల్ని ఇన్సూరెన్స్ వచ్చిందని ఆశ చూపించి పార్టీలో సభ్యత్వం తీసుకోవడం వల్ల పార్టీకి నష్టమే కాని ఉపయోగం ఉండదని, పార్టీని ప్రేమించే వాళ్ళు కాదు కాబట్టి అలాగే మైలవరం నియోజకవర్గం లో సీనియర్ నాయకులను సరైన గౌరవం ఇవ్వకుండా చిన్న .. చిత్కా రాజకీయ అనుభవం లేని వ్యక్తులతో మెంబర్షిప్ డ్రైవ్ జిల్లా ప్రెసిడెంట్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రారంభించారు . దీనివల్ల మైలవరం నియోజకవర్గం లో వర్గ పోరుకు వారే నాంది పలికారని అన్నారు. రాజకీయం అంటే ఒక వర్గాన్ని నమ్ముకొని వెళ్ళేది కాదు అని వర్గాల ప్రజలు అన్ని వర్గాల నాయకులు ఉండాలి. అయినా జనసేన మెంబెర్ షిప్ డ్రైవ్ లో తెలుగుదేశంమైలవరం నియోజకవర్గ జనసేనకి తెలుగుదేశం కాలు కింద పడేస్తున్నారు. స్వయంగా జనసేన పార్టీ ఎమ్మెల్యే సీటు గెలిచే దమ్మున్న తెలుగుదేశం పార్టీ నాయకులకు సాగిలపడతం ఏంటని ప్రశ్నించారు. పొత్తు ఉంటే ప్రభుత్వం వరకే అంతే గాని జనసేన పార్టీ కార్యక్రమంలో టిడిపి వారి నీ నాయకులుగా పరిచయం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానం మైలవరం నియోజకవర్గంలో జనసేన పార్టీని చంపేసే కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు .10 సంవత్సరాల నుంచి పార్టీ ఎదుగుదలకు ఏ విధమైన కృషి ప్రయత్నం జరగట్లేదని . మైలవరం నియోజకవర్గంలో టిడిపి వారికి భజన తప్పించి ఇప్పటికైనా అందరం కలిసి మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీని బలపరుచుకుందాం రేపు రాబోయే రోజుల్లో జనసేన పార్టీ సంబంధించిన వ్యక్తి ఎమ్మెల్యే అయ్యేవిధంగా కృషి చేద్దాం అని పులిపాక ప్రకాష్ పేర్కొన్నారు.

## చెడుతనాన్ని వీడి మంచివానిగా

# మారుటయే తపస్సుకాలము

- రేవ ఫా కిరణ్ కుమార్ ప్రత్తిపాటి
- తపస్సుకాల కూటములు ఘన ముగింపు

**మైలవరం, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్)**



మైలవరం విచారణ పరిధిలోని 16 సంఘాలకు చెందిన విశ్వాసుల సమక్షంలో కోడూరు గ్రామంలోని ఆర్‌సీఎం దేవాలయ ప్రాంగణంలో తపస్సుకాల మూడవ గ్రామ కూటములు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విచారణ గురువు రెవ. ఫా. కే. అనీల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ, గుడ్ ఫ్రైడే వరకు కొనసాగనున్న తపస్సుకాల ప్రార్థనా సదస్సులు ప్రతి విశ్వాసికి ఆత్మపరిశీలనకు దారి చూపుతాయని అన్నారు. ఉపవాసం, ప్రార్థన, పుణ్యకార్యాల ద్వారా చెడు అలవాట్లను విడిచి సత్మార్గంలో నడవాలని సూచించారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన రెవ. ఫా. ప్రత్తిపాటి కిరణ్ కుమార్ పరిశుద్ధ దివ్యపూజాబలి మరియు దివ్య సత్ప్రసాద ఆరాధన నిర్వహించి సందేశం ఇచ్చారు. మనిషిలో పాపప్రవృత్తులు పెరుగుతున్న ఈ కాలంలో యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, శాంతి, క్షమాభావాలను ఆచరించి దేవునియందు భయభక్తులతో నూతన జీవితం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. చెడుతనాన్ని విడిచి మంచితనాన్ని ఆచరించడమే తపస్సుకాల సందేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో మఠకన్యలు, ఉపదేశకులు, కోడూరు సంఘ పెద్దలు జి. యోహాను, జి. అశోక్, వి. పేతురు, జె. సాల్మన్, వి. సురేష్, మరియదళ సభ్యులు, మదర్ దెరిసా యువకులు, సండే స్కూల్ విద్యార్థులు, పాటల క్వయర్ బృందం, మైలవరం విచారణకు చెందిన 16 సంఘాల విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించి ఆధ్యాత్మిక ఐక్యతను ప్రతిబింబించారు.

## మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ కు ఘన సన్మానం



మంథని, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్) : మంథని మున్సిపల్ వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డిని సినిమా హాల్స్ సిబ్బంది ఆదివారం ఘనంగా సత్కరించారు. మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి లో ఉన్న ఎస్ఆర్ సినిమా థియేటర్ హాల్ సిబ్బంది సహేందర్ రెడ్డి వైస్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి సహేందర్ రెడ్డి తో పాటు వారి సోదరుడు కిసాన్ సెల్ జిల్లా చైర్మన్, మంథని రెడ్డి సంఘం అధ్యక్షుడు సురేందర్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సినిమా హాల్ మేనేజర్ అభిలాష్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఆపరేటర్ సాయి, అజయ్, సిబ్బంది వేణు, కిషన్, శంకర్, విష్ణు, శంకర్, విజ్ఞేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ గా షేక్ హాజీ బాబా




(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి మహేశ్వరం మార్చి 02 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కి చెందిన షేక్ హాజీ బాబా మాట్లాడుతూ... శనివారం హైదరాబాద్ నగరంలో జరిగిన అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవం లో తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ గా షేక్ హాజీ బాబా ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజీ బాబా మాట్లాడుతూ తెలంగాణలోని టైలర్స్ అభివృద్ధికి కృషి చేస్తామని టైలర్స్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు ప్రభుత్వం ద్వారా సహకారాలు ప్రతి టైలర్ అందేలా చూస్తామన్నారు మహేశ్వరం నియోజకవర్గం లో మండల కమిటీలు గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి టైలర్లను ఏకం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ టైలర్స్ అండ్ మగ్గం వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ అజీమ్. అధ్యక్షులు మహమ్మద్ అన్వర్. ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## షైన్ హై స్కూల్ లో ఘనంగా జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ వేడుకలు

### ముఖ్య అతిధులుగా పాల్గొన్న యంగ్ అండ్ డైనమిక్ లీడర్ బి పి నాయక్ ,వైరా ఏసీపీ సారంగపాణి , బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ పొదిలి వెంకన్న



ఖమ్మం, బోనకల్, (జర్నలిస్ట్ ఫైల్) : స్థానిక షైన్ హై స్కూల్ లో విజ్ఞాన దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. 1వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్ట్స్ తయారు చేసి అందరిని ఆశ్చర్య పరిచారు. వారి ప్రాజెక్ట్స్ గురించి వచ్చిన అతిధులకి క్లుప్తంగా వివరించారు. మొత్తం 60 ప్రాజెక్ట్స్ తయారు చేసారు. ఈ సందర్భంగా ఏసీపీ సారంగపాణి మాట్లాడుతూ విద్యార్థులే దేశ ప్రగతికి ముఖ్యం అని, శాస్త్రవేత్తలుగా మారి దేశ పురోభివృద్ధికి తోడ్పాడాలని అన్నారు. యూత్ లీడర్ బి పి నాయక్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం లాంటి గొప్ప శాస్త్రవేత్తలు మన దేశం లో పుట్టారని, అలాంటి వ్యక్తులని ఆదర్శం గా తీసుకుని ముందుకు నడవాలని అన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ యువత ఎప్పుడు ప్రయత్నిస్తున్నే ఉండాలని, కష్టపడితే విజయం మనదే అని అన్నారు.



ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండెంట్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు,విజ్ఞాన శాస్త్ర భోదకులు వెంకటేశ్వర్లు, వెంకట్, వాణి శైలజ, కవిత, రుక్సానా, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ నాల్గవ తరగతి మహిళా ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడలు

### మహిళా దినోత్సవ సందర్భంగా నాలుగోవ తరగతి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు





ఖమ్మం, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల ఖమ్మం జిల్లా కమిటీ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా మహిళా ఉద్యోగులకు జేమ్స్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఆటల పోటీలను టెన్నికాయిట్ ఆడి ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ అందరూ మంచిగా ఉద్యోగం చేసి భవిష్యత్తులో ప్రమోషన్లు పొంది మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని ఉద్యోగులను ఈ సందర్భంగా కోరారు . అదే విధంగా ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కు ఉన్న సమస్యలన్నీ ప్రభుత్వంతో మాట్లాడి త్వరలో అన్ని పరిష్కరిస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి టీఎన్జీవో అధ్యక్ష ,కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు బుల్లెట్ శ్రీను, మోదుగు వేలాద్రి, కారుమంచి శ్రీనివాసరావు, రుక్మారావు, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.బిక్కు, సహాయ అధ్యక్షులు ఆర్ ఓదేలు, కోశాధికారి ఎం అజ్మీర్బేగ్, కాంపాటి వెంకటరమణ, జిల్లా కోశాధికారి వి కనకారావు, ఎస్ కే జానీ మియా, జి రాంబాబు, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ ని సన్మానించడం జరిగింది.



# రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.

**రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది.**

**ఇళ్లను కూలగొట్టడంభూములను అమ్మడం...రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేయడం,ఇదే రేవంత్ రెడ్డి పరిపాలన.**

**మూసీ పేరిట తాను చేస్తున్న స్కామ్ కోసం వేలాదిమంది ఇళ్లను రేవంత్ కూలగొడుతున్నాడు.**

**మూసీ బాధితులకు మా పార్టీ అండగా ఉంటుంది:కేటీఆర్.**

**రెండు సంవత్సరాలు మీ ఇళ్లను,భూములను కాపాడుకోండి...మా ప్రభుత్వం వచ్చాక మీ ఇళ్లను ముట్టకుండా చూసే బాధ్యత మాది.**

**మరో రెండేళ్లు తెలంగాణను కాంగ్రెస్ నుంచి కాపాడుకోవాలి:కేటీఆర్.**



రాజేంద్రనగర్, మార్చి 02 (జర్నలిస్ట్ ఫైల్) : మూసీ బాధిత కుటుంబాలపై కాంగ్రెస్ ప్రభుత్వ బెదిరింపులు ఆపాలి.మూసీ బాధిత కుటుంబాలతో 'మూసీ దండి మార్చ్'కార్యక్రమంలో భాగంగా మూడున్నర కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి,పార్టీ




నాయకులు కార్తిక్ రెడ్డి.వేలాదిమంది ప్రజలు,మూసీ బాధితులతో వారి ఆవేదన వింటూ ముందుకు సాగిన కేటీఆర్.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీతో పాటు మిగిలిన నేతలంతా చెబుతుంటే,తెలంగాణలో జరుగుతున్న ఈ బుల్డోజర్ రాజ్యాన్ని, దాని అరాచకాలను మాత్రం ఆపకుండా కాంగ్రెస్ మౌనంగా ఉందన్నారు.ఒకవైపు బుల్డోజర్ రాజ్యంపై విమర్శలు చేస్తూ,ఇక్కడ రేవంత్ రెడ్డి చేస్తున్న బుల్డోజర్ అరాచకాలను కేవలం రేవంత్ పంపిస్తున్న సంచుల కట్టల కోసం చూడనట్లు వదిలేస్తున్నారన్నారు.రేవంత్ రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇళ్లను కూలగొట్టడం,భూములు ఆక్రమించడం,రియల్ ఎస్టేట్ దందా చేయడం,దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రజల ఇళ్లను కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే తన పనిగా పెట్టుకున్నారని కేటీఆర్ అన్నారు.తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఒక్క ప్రాజెక్టు గాని,ఒక్క ఇల్లు గాని,ఒక్క రోడ్డు గాని వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈరోజు హైదరాబాద్‌లో మూసీ ప్రాజెక్టులో భాగంగా పెద్ద ఎత్తున తమ ఇళ్లను, భూములను, అపార్ట్‌మెంట్లను కోల్పోతున్న రాజేంద్రనగర్ ప్రాంతంలోని హైదర్ షా కోట్,మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధితులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు.మూసీ బాధితుల కోసం వారు నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో మూడున్నర కిలోమీటర్ల పాటు అనేకమంది బాధితులను కలుస్తూ కేటీఆర్ ముందుకు సాగారు.ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను,అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని,ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని,తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు,ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.అపార్ట్‌మెంట్ వాసులు,కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా,వేడుకున్నా,చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా,కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ,బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200 కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని,ఇప్పటికే ఆయనకు ప్యాలెస్‌లాంటి ఇల్లు ఉన్నదని,అయినా రేవంత్ రెడ్డికి,ఆయన అన్నదమ్ములకు మాత్రం వందల కోట్ల ఇళ్లు కావాలి కానీ పేదలు,మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ కూడా ఉండకుండా ఎందుకు ఈ విధ్వంసమని కేటీఆర్ ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు.అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి,అటు రామగుండం,మహబూబ్‌నగర్,ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా,వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేలా ఇళ్లు కూలగొడుతున్నారన్నారు.కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం తన అనుచరులకు,అన్నదమ్ములకు,కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని, ఇందుకోసం పేదల ఇళ్లను పణంగా పెడుతున్నారన్నారు.గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 16 వేల కోట్ల రూపాయలతోనే మూసీ సుందరీకరణ కార్యక్రమానికి ఒక్క ఇల్లు కూడా పోకుండా డీపీఆర్ సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు.కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లైఓవర్లను కూడా మా ప్రణాళికలో ఉంచామని,కానీ ఎక్కడా కూడా ఒక్క ఇల్లుకు ఇబ్బంది కాకుండా చూశామన్నారు.అలాంటి అంశాన్ని పక్కన పెట్టి లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీ కోసం వేల మంది ఇళ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కు తెరలేపారన్నారు. ఈరోజు మూసీ బఫర్ జోన్‌కు సంబంధించి రకరకాల మాటలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇదే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చిందని,మరి అలాంటి అధికారులపై, ఆనాడు అనుమతులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టాలా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం నడిపిస్తోందని విమర్శలు చేస్తారని, స్వయంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేస్తున్న బుల్డోజర్ రాజ్యం గురించి మాత్రం మాట్లాడటం లేదన్నారు.మరోవైపు మూసీలో ఇళ్లు ఉన్నాయని అబద్ధాలు చెబుతూ ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం,తమ సొంత మంత్రులు,ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫార్మ్‌హౌస్‌లు,విల్లాలు,ఇళ్లను ఎందుకు ముట్టుకోవడం లేదన్నారు.రాష్ట్రాన్ని ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ నడుపుతున్నాడని, అందుకే ఇన్ని రకాల ఇబ్బందులు వస్తున్నాయన్నారు.రేవంత్ రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు.మూసీ బాధితుల కోసం భారత రాష్ట్ర సమితి అన్ని రకాలుగా అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు. వీరికి సంబంధించిన న్యాయపోరాటంలోనూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టు కోసం వేలమంది ఇళ్లను కూల్చడం ఆపేయాలని,తమ ఎమ్మెల్యేలను, నాయకులను పంపి బెదిరింపులకు దిగడం మానేయాలని కేటీఆర్ హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు,ఇళ్లకు బదులు డబ్బులు ఇస్తామని మోసం చేసే ప్రయత్నాలకు లొంగకుండా ఐక్యంగా ముందుకు సాగాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



## అధికారుల జులుంపై జాతీయ గిరిజన సంఘం తీవ్ర ఆగ్రహం

**ఈ అమానుష ఘటనను స్వచ్ఛందంగా విచారణకు స్వీకరించిన కమిషన్**

**ఇళ్లు కూల్చే హక్కు ఏ చట్టం ఇచ్చిందని నిలదీసిన జాతీయ గిరిజన సంఘం సభ్యుడు జాతోత్ హుస్సేన్ నాయక్**

**బాధిత కుటుంబాలకు అదే స్థలంలో ఇళ్లు నిర్మించుకునేలా అనుమతి ఇవ్వాలని ఆదేశం**

**వారం రోజుల్లో నివేదిక ఇవ్వకపోతే ఢిల్లీకి పిలిపిస్తామని ఖమ్మం అధికారులకు అల్టిమేటం**



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం జిల్లా వెలుగుమెట్ల భూదాన భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేయడం పట్ల జాతీయ



గిరిజన సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను స్వచ్ఛందంగా విచారణకు స్వీకరించిన సంఘం సభ్యుడు జాతోత్ హుస్సేన్ నాయక్. ఆదివారం ఢిల్లీ నుంచి నేరుగా ఖమ్మం చేరుకుని బాధిత ప్రాంతాన్ని సందర్శించారు. కనీస వసతులు లేకుండా చెట్ల కింద కాలం వెళ్లదీస్తున్న బాధితుల కష్టాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

### పన్నులు కట్టించుకుని బతుకులు కూలుస్తారా?

గత 15 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, రూ. 15,000 వెచ్చించి సౌర విద్యుత్ కూడా ఏర్పాటు చేసుకున్నామని బాధితులు ఆయన ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. పురపాలక సంఘం తమ ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించిందని, క్రమం తప్పకుండా పన్నులు కూడా వసూలు చేసిందని తెలిపారు. పన్నులు కట్టించుకున్న అధికారులే, తాము పనులకు వెళ్లిన సమయంలో కనీసం ఇంట్లోని వస్తువులు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఇళ్లను కూలగొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

### ఇదేనా మీరు చెబుతున్న ఇందిరమ్మ రాజ్యం?

బాధితుల గోడు విన్న హుస్సేన్ నాయక్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మహానుభావుడు వినోబా భావే 80,000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సేకరించిన ఈ 62 ఎకరాల భూదాన భూమి చట్టప్రకారం పేదలకే చెందాలని స్పష్టం చేశారు. "ఇందిరమ్మ రాజ్యం" తెస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాల్సింది పోయి ఉన్న ఇళ్లను కూలగొట్టడం కక్షసాధింపు చర్యలకు నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు (ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా) ఉన్నప్పటికీ, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన సుమారు 700 కుటుంబాలను రోడ్డున పడేయడం శోచనీయమన్నారు. మూసీ పేరుతో రాజధానిలో ఇళ్లు కూలగొడుతున్నట్లుగానే, ఇక్కడ కూడా అధికారులను అడ్డుపెట్టుకుని బడా బాబులు పేదల భూములను ఆక్రమించే కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

### అధికారులకు వారం రోజుల అల్టిమేటం

ముందస్తు సమాచారం లేకుండా పేదల ఇళ్లు కూల్చే అధికారం అధికారులకు ఏ చట్టం ఇచ్చిందని ఆయన నిలదీశారు. బాధితులకు తక్షణమే అదే స్థలంలో గుడిసెలు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని, తాగునీరు, విద్యుత్ వసతులు పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులను కఠినంగా ఆదేశించారు. ఈ ఘటనపై వారం రోజుల్లోగా జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని, నిర్లక్ష్యం చేస్తే ఢిల్లీలోని విచారణ సంఘం ముందు హాజరుకావాల్సి వస్తుందని హెచ్చరించారు. పేదలకు న్యాయం జరిగే వరకు జాతీయ గిరిజన సంఘం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, గల్లా సత్యనారాయణ, దొంగల సత్యనారాయణ, పివి రమేష్, నున్న రవికుమార్,పుల్లారావు యాదవ్, రవి రాథోడ్, వీరవెల్లి రాజేష్, దొడ్డ అరుణ, శ్యాం రాథోడ్, జ్వాల నరసింహారావు, ఏలూరు నాగేశ్వరరావు, అత్తి విజయ రెడ్డి, ఒకదాని రామకృష్ణ , జాటోత్ మధు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## వాజపేయి శత జయంతి ఉత్సవాల కమిటీ కి అభినందనలు తెలిపిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం లో జరిగిన వాజపేయి శత జయంతి ఉత్సవాల నిర్వహణ కమిటీ కి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. భారత దేశములోనే గాక ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న మహానాయకుడు భారతరత్న స్వర్గీయ అటల్ బిహారీ వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సభను ఏర్పాటు చేసి, 'అటల్ జీ కి అక్షరనీరాజనం' అనే కవితాసంకలనం కూడా వెలువరిస్తున్న ఖమ్మం జిల్లా వాజ్ పేయి శతజయంతి ఉత్సవ కమిటీ వారికి నా హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. స్వర్గీయ వాజ్ పేయి భారత రాజకీయ వినీలాకాశం లో ఓ ధృవతార. విలువలతో నిండిన రాజకీయ వ్యవస్థ కోసం పరితపించిన మనిషి. ఐదు దశాబ్దాలు పార్లమెంటేరియన్ గా, ప్రతి పక్ష నాయకుడిగా, సంక్షోభ సమయంలో భారతదేశ ప్రతినిధిగా, భారత ప్రధానిగా దేశానికి సేవలు అందించిన ధన్య జీవి. పార్టీలకు అతీతంగా ప్రజాక్షేత్రం లో పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలు అందరికీ ఆయన జీవితం, వ్యక్తిత్వం ఉదాత్త ప్రేరణను ఇస్తాయి. ఈ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆ అమరనేత స్మృతికి అంజలి ఘటిస్తూ, అనివార్య కారణాల వలన రాలేక పోయాను. ఈ శతజయంతి సభ మన ఖమ్మం జిల్లాకు గర్వకారణమని భావిస్తూ, సభ విజయవంతం కావాలని ఆశీస్సులు అందజేశారు.

## మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత : డీఎస్పీ రాజేంద్రప్రసాద్




**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీస్ శాఖ మహిళలు బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో వారోత్సవాలలో భాగంగా మైదుకూరు పట్టణం లోని అంబేద్కర్ విగ్రహం నుండి శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ వరకూ సోమవారం ర్యాలి నిర్వహించారు.

ఈ సందర్భంగా మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మైదుకూరు లో మహిళలు బాలికల భద్రతపై గత కొన్ని నెలలుగా కాలేజీలు పాఠశాలలు పల్లె నిద్ర కార్యక్రమాల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎలాంటి సమస్య ఎదురైనా డయల్ 112 నెంబర్ కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తారన్నారు. క్రిమినల్ (నేర పూరిత చర్య) కోణం ఉంటే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ర్యాలీలో మైదుకూరు అర్బన్ పీఎస్ సీఐ కె.రమణా రెడ్డి ఎస్సై కె.వెంకట రమణ మరియు బాలికల ఉన్నత పాఠశాల అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైతుల భూములు సోలార్‌కు అప్పగిస్తే అడ్డుకుంటాం



**○ వ్యవసాయ కార్మిక సంఘం**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండలంలోని పలుగురాళ్లపల్లి పాపిరెడ్డి పల్లె రెవెన్యూ పొలాల్లోని 176 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని సోలార్ కంపెనీకి కేటాయించడం దుర్మార్గమని అదే రకంగా మొత్తంగా కేటాయించిన 600 ఎకరాల్లో అనేక అరటి తోటలు జామ తోటలు కొబ్బరి తోటలు ఇతర పంట పొలాలు వందల ఎకరాల్లో ఉన్నాయని వీటన్నిటిని సోలార్ వారికి కేటాయించాలనుకోవడం దుర్మార్గమని వెంటనే ప్రభుత్వం సోలార్ కు కేటాయించిన భూములను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సానా గోవిందస్వామి, హరి, ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్ లు డిమాండ్ చేశారు. సోమవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 400 ఎకరాల స్థలాన్ని సోలార్ కు కేటాయించడం సరైనది కాదని ఓ పక్క పేదలకు భూములు లేక అల్లాడుతుంటే మరోపక్క పేదలకు చెందాల్సిన భూములను ప్రైవేట్ కంపెనీ అయినా సోలార్ కు కేటాయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రైతులు అప్పులు చేసి పంటలు పండించుకొని పంట రాక పెట్టిన పట్టుబడి రాక పంటపొలంలోనే రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదులుతున్నారని వారు అన్నారు. అలాంటి రైతులకు చెందిన భూములను నేడు ప్రభుత్వం సోలార్ కి ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. సోలార్ కు కేటాయించిన భూములను పరిశీలించడం కోసం గురువారం నాడు వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఈ ప్రాంతాల్లో పర్యటించడం జరుగుతుందని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి పంటలు పండే భూములను, సాగులో ఉన్న భూములను, రైతులకు చెందిన భూములను సోలార్ కు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలను, రైతులను కలుపుకొని ఆందోళన కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గండి గురయ్య, చిన్నప్ప లు పాల్గొన్నారు.

## సెలవు రోజుల్లో పని చేయనున్న జీఎంసీ క్యాష్ కౌంటర్లు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** 2025--26 ఆర్థిక సంవత్సరము ఆస్తి పన్ను, బకాయిలను చెల్లించుటకు వీలుగా, మంగళవారం (హోలీ) సెలవు రోజైనప్పటికీ కూడా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో పన్నుచెల్లింపు కేంద్రాలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని, బకాయిదార్లు పన్నుకు సంబదించి ఏమైనా సందేహాలు ఉంటే ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండే జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 కి కాల్ చేస్తే పూర్తి వివరాలు అందిస్తామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజలు ఆస్తి, ఖాళీ స్థల పన్నులు మరియు నీటి పన్నులు పూర్తిగా చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం హోలీ పండగ సెలవు రోజైనప్పటికీ జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్లలో నగర పాలక సంస్థకు చెల్లించవలసిన పన్ను చెల్లించవచ్చన్నారు. అలాగే పన్ను బకాయిలపై మార్చి 1న బకాయిదారుల ఫోన్లకు మెసేజ్ లు కూడా పంపామని, ఇంకా ఏమైనా సందేహాలు ఉన్నా కాల్ సెంటర్ కి కాల్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## జాతీయ రహదారి వెంట ఉన్న హోల్సేల్ కూరగాయల మార్కెట్ తొలగింపు



**○ హైకోర్టు ఉత్తర్వుల మేరకు నిర్ణయం**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** హైకోర్ట్ ఉత్తర్వుల ప్రకారం, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన అనదికార హోల్ సేల్ కూరగాయల మార్కెట్ షాప్ లను సోమవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ప్రజారోగ్య అధికారులు పోలీసుల పర్యవేక్షణలో తొలగించారు . హైకోర్ట్ నిర్దేశిత గడువులోగా అనధికార మార్కెట్ ని తొలగించాలని జిఎంసిని ఆదేశించిన మేరకు సోమవారం తొలగించడం జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు. రైతులు తమ కూరగాయల విక్రయాలను అనధికార మార్కెట్ ల్లో కాకుండా జిఎంసి కొల్లి శారద హోల్ సేల్ మార్కెట్ లోనే విక్రయించుకోవాలని కమిషనర్ సూచించారు.

## గుంటూరు పశ్చిమ అభివృద్ధిపై సమగ్ర యాక్షన్ ప్లాన్

**○ గుంటూరు నగరపాలక సంస్థ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే గళ్లా మాధవి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** నగర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. గుంటూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన గుంటూరు నగరపాలక సంస్థ సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. నగరంలో కొనసాగుతున్న ఆర్‌ఓబి నిర్మాణం, పీవీకే నాయుడు మార్కెట్ పునర్నిర్మాణం, నార్ల ఆడిటోరియం అభివృద్ధి, కృష్ణానగర్ రైతు బజారు, రోడ్ల విస్తరణ, పార్కుల సంరక్షణ తదితర పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిలిచిపోయిన పనులకు కారణాలు తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నగరంలో ఎక్కడా నీటి కొరత లేకుండా చివరి ప్రాంతానికి కూడా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మే నెలాఖరులోగా ప్రధాన డ్రెయిన్లలో డిసిల్టేషన్ పూర్తి చేసి వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

పీవీకే నాయుడు మార్కెట్‌కు కొత్త డీపీఆర్ సిద్ధం చేసి మార్చి 9 లేదా 10న సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నార్ల ఆడిటోరియం పనులు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

గుంటూరు పశ్చిమలో ముస్లింలకు ఖబరస్థాన్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తక్షణం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వీధి కుక్కల సమస్య నియంత్రణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

## పారిశుధ్య పనుల్లో లోపాలు సహించేది లేదు

**○ నగర కమిషనర్ మయూర్ అశోక్ హెచ్చరిక**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేదని, ఎక్కడైనా సిబ్బంది, అధికారులు, సచివాలయ సెక్రెటరీలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. సోమవారం ముత్యాలరెడ్డి నగర్, వికాస్ నగర్, జేకేసీ రోడ్, మ్యాంగో స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్దేశిత 'పిన్ పాయింట్ ప్రోగ్రాం' లేకుండా విధుల్లో ఉన్న 112వ వార్డు శానిటేషన్ కార్యదర్శిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సదరు కార్యదర్శికి తక్షణమే షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిఎంఓహెచ్ ని ఆదేశించారు.

ఈ సందర్భంగా కమిషనర్ పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం అధికారులకు కీలక సూచనలు చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో నిర్దేశిత పిన్ పాయింట్ ప్రోగ్రాం మేరకు పారిశుధ్య పనులు జరగాలని, ఎక్కడైనా పిన్ పాయింట్ మేరకు లేకుంటే సంబందిత సిబ్బందిని విధుల నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మధ్యాహ్నం సమయంలో చేపట్టే గ్యాంగ్ వర్క్ పనులు మరింత సమర్థవంతంగా జరగాలని, విధుల్లో పారిశుధ్య కార్మికుల హాజరు నూరు శాతం ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. డ్రైన్ల క్లీనింగ్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయడంతో పాటు, ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియ నూరు శాతం పక్కాగా జరిగేలా చూడాలన్నారు. పారిశుధ్య మెరుగుదలలో భాగంగా నగరంలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి తక్షణమే క్లస్టర్ కంపోస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే, నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి వెంటనే వాటిలో జీఎంసీ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, నోటీసులు ఇచ్చినా స్పందించని ఖాళీ స్థలాల యజమానులపై తక్షణమే అపరాధ రుసుం (పెనాల్టీ) విధించాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా కమర్షియల్ ఏజన్సీకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గార్బేజ్ వల్నర్బుల్ పాయింట్స్ ఉండడానికి వీలు లేదని, ఎస్ఎస్ లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రైన్లకు సమాంతరంగా ఉన్న త్రాగునీటి పైప్ లైన్లను గుర్తించి, వాటిని షిఫ్ట్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ఎస్ఎస్ సోమశేఖర్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కార్డన్-సెర్చ్ ఆపరేషన్

**○ పత్రాలు లేని 65 వాహనాల స్వాధీనం**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా గుంటూరు జిల్లా తెనాలి 3టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సి.ఎం కాలనీలో సోమవారం విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తెనాలి డీఎస్పీ జనార్ధనరావు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ సందర్భంగా కాలనీలోకి వచ్చే, వెళ్లే మార్గాలను పూర్తిగా మూసివేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, గృహాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ కెమెరాల ద్వారా పైనుంచి నిఘా ఏర్పాటు చేసి ప్రాంతాన్ని జల్లెడ పట్టారు.

తనిఖీల్లో సరైన పత్రాలు లేని ఐదు ఆటోలు, 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం స్టేషన్‌కు తరలించారు. అనుమానితుల వివరాలు సేకరించి క్రిమినల్ రికార్డులను పరిశీలించారు.

డీఎస్పీ జనార్ధనరావు మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్న "సంకల్పం" కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ, యువతలో చెడు వ్యసనాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పార్టీల పేరుతో యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారనే సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కాలనీలో అనుమానాస్పద వ్యక్తుల సంచారం గమనించినా, మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశ్యం నేరస్థుల గుర్తింపు, మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ ఆయుధాలు మరియు నిషేధిత వస్తువుల స్వాధీనం, అనుమానాస్పద కార్యకలాపాల నిరోధం, ప్రజల్లో భద్రతాభావం పెంపు అని వివరించారు. డ్రగ్స్ రహిత ప్రాంతంగా తెనాలిని తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. అనంతరం స్థానికులతో కలిసి "సంకల్పం ప్రతిజ్ఞ" చేయించారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ పోలీస్ స్టేషన్ల సీఐలు ఎస్. సాంబశివరావు, వి. మల్లికార్జునరావు, షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని రేకులకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లె నుండి రేకులకుంట వరకు మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో గ్రామపంచాయతీ గ్రాంట్ కింద 10 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్డును ఏర్పాటు చేస్తూ సోమవారం మాజీ మండలాధ్యక్షుడు మాలేపాటి సుబ్బారావు జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున్ రెడ్డి మాజీ ఉప మండలాధ్యక్షుడు భూతప్ప నాయుడు అలాగే ఇంజనీరింగ్ అధికారులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి టెంకాయ కొట్టి సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.

## ప్రజా అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

**○ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** పీజీ ఆర్ఎస్ అర్జీలు సక్రమంగా పరిష్కారం లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ , జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు గంగరాజు, లక్ష్మీ కుమారి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజీఆర్ఎస్ లో ప్రజలు అందించిన అర్జీలను తొలుత సంబందిత అధికారులు పూర్తిగా పరిశీలించి పరిష్కార చర్యలకు నిర్దేశిత సమయాన్ని ఖచ్చితంగా తెలిపారన్నారు. నిబంధనల మేరకు పరిష్కారం కానీ సమస్యలను అర్జీ దారులకు అర్ధమయ్యేలా తెలిపాలన్నారు. అర్జీదారుల సమస్యలను సక్రమంగా పరిశీలించకుండా దీర్ఘకాలికంగా పరిష్కారానికి చర్యలు తీసుకొని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పీ.జీ.ఆర్.ఎస్ కు మొత్తం 350 అర్జీలు అందాయి. అందులో రెవెన్యూ శాఖ కు సంబంధించి 161 అర్జీలు, ఇతర శాఖల అర్జీలు 229 అందాయి. ప్రభుత్వం ఐ.వి.ఆర్.ఎస్ విధానంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకలపై అభిప్రాయాలను సేకరిస్తుందని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించాలని సూచించారు. ఎక్కడ లోపం ఉంటే అక్కడ నుండి సానుకూల అభిప్రాయం వ్యక్తం కాదని, దీనిని దృష్టిలో పెట్టుకుని క్షేత్ర స్థాయిలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు. రెవిన్యూ అంశాలపై తహసీల్దార్లు మరింత శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, సమస్యల పరిష్కారం, సేవలు అందించడం తదితర అన్ని విభాగాలలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శంకరన్ హాలు వెలుపల వికలాంగుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, డి.ఎం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక - 165 ఫిర్యాదుల స్వీకరణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మొత్తం 165 ఫిర్యాదులు స్వీకరించబడ్డాయి. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆధ్వర్యంలో డీఎస్పీ స్థాయి అధికారులు పాల్గొని ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విన్నారు.

ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు వెంటనే పంపిస్తూ, చట్టపరమైన గడువులోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకసారి వచ్చిన ఫిర్యాదు పూర్తిగా విచారించి, శాశ్వత పరిష్కారం చూపాలని, ఫిర్యాదుదారులు మళ్లీ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా చూడాలని సూచించారు.

బాధితులతో సానుభూతితో, బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెంపొందించాలన్నారు. ప్రతి ఫిర్యాదుదారునికి తన ఫిర్యాదు పురోగతి గురించి సమాచారం అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

కుటుంబ కలహాలు, భూ-ఆస్తి వివాదాలు, ఆర్థిక సమస్యలు, మోసపూరిత వ్యవహారాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా నమోదయ్యాయి. వాటిపై తక్షణ విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ట్రాఫిక్ డీఎస్పీ మరియు ఇన్‌ఛార్జి పశ్చిమ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, సీసీఎస్ డీఎస్పీ మరియు ఇన్‌ఛార్జి దక్షిణ డీఎస్పీ మధుసూదన్ రావు, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ కొండా సింగరాయుడుస్వామి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** మండల కేంద్రంలోని మిట్టమానపల్లె దారిలో వద్ద శ్రీ ఈశ్వరమ్మ గృహ దగ్గరలో ఉన్న శ్రీ కొండ సింగరాయుడు స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతాయని దేవదాయ శాఖ ఆలయ ఈవో తెలిపారు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ కొండ సింగ రాయుడు స్వామి ఉత్సవాలు నేటి ఉదయం సుప్రభాత సేవ గ్రామస్తులు భజన కార్యక్రమం పలు సాంస్కృతిక కార్యక్రమాలు మధ్యాహ్నం అన్నదానంతో ముగుస్తాయని ఈ కార్యక్రమంలో భక్తులు స్థానిక ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈవో పేర్కొన్నారు.

## సోలార్ విండ్ పవర్ ప్రాజెక్టు కు భూ కేటాయింపుల్లో పేదలకు అన్యాయం




**○ పేదలకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం:- సిపిఐ మండల కార్యదర్శి పెద్దల్లపల్లి ప్రభాకర్ హెచ్చరిక**

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారి మఠం మండల పరిధిలోని పలుగురాళ్లపల్లె రెవెన్యూ పొలం మరియు పాపిరెడ్డిపల్లె పొలంలో సోలార్ కంపెనీకి భూముల కేటాయించడంలో పేదలకు అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుళ్లపల్లి ప్రభాకర్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విండ్ పవర్ ప్రాజెక్టు కంపెనీ కి మండల పరిధిలోని పలుగురాళ్ళపల్లె రెవెన్యూ పొలంలో 1938 సర్వే నెంబర్ లో 153 ఎకరాలు అదేవిధంగా పాపిరెడ్డి పల్లె రెవెన్యూ పొలంలో 418 నంబర్ లో 23 ఎకరాలు భూమినీ కేటాయించారు. ఇందులో దళితుల భూమి ఉండడంతో వీళ్ళు గట్టిగా మాట్లాడలేరు. భూములు లాక్కోవచ్చు అనే దురుద్దేశంతో అధికారులు కంపెనీ వాళ్ళతో కుమ్మక్కై భూములు కంపెనీ కీ కట్టబెట్టాలని ఆలోచన చేయడం దుర్మార్గమని అయన ఆరోపించారు. ఇందులో భూములు కోల్పోయిన రైతులు చెంచయ్యగారి పల్లె, మల్లెపల్లె, జ్ఞ?కు పల్లె, పలుగురాళ్లపల్లె గ్రామాలకు చెందినవారు. ఇందులో ఎస్సీలు మరియు బీసీలు మాత్రమే అధికంగా ఉన్నారు.

వీరికి గతంలో జరిగిన అసైన్మెంట్ఇచ్చిన భూములతో పాటు తర్వాత అసైన్మెంట్ జరగకపోవడంతో, దాదాపు 30 నుండి 40 సంవత్సరాలుగా రైతులు ఆ పొలంలో అనుభవంలో ఉన్నప్పటికీ వారికి కనీసం నష్టపరిహారం చెల్లించకుండా దౌర్జన్యంగా ఆ భూమిలో జెసిబి, మిషన్లు పెట్టి పనులు చేయించడం దుర్మార్గమని ఆయన ఆరోపించారు. రెవిన్యూ అధికారులు, రాజకీయ నాయకులు అక్కడ భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేసి తర్వాత పనులు మొదలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధితులకు అండగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిలబడి ఉద్యమించి వారికి నష్టపరిహారం ఇచ్చేంతవరకు పోరాడుతామని పేద ప్రజలకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు సుమంత్ లు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సియం ఎక్స్అఫిషియో స్పెషల్ సిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయానంద్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సియం ఎక్స్అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కె. విజయానంద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 28న సిఎస్‌గా ఆయన పదవీ విరమణ చేయగా ప్రభుత్వం విజయానంద్‌ను ముఖ్యమంత్రివర్యుల ఎక్స్అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో సోమవారం రాష్ట్ర సచివాలయం మొదటి భవనంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం మరియు టిటిడి వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు ఉన్నతాధికారులు,సచివాలయ వివిధ విభాగాల అధికారులు,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు విజయానంద్ కు పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జాతీయ సదస్సులో నిర్మల ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (=ఖూూ 2.0) ప్రాయోజకత్వంలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -- మెషిన్ లెర్నింగ్ ఇన్ ఫార్మాస్యూటికల్ సైన్స్" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులతో పాటు రాష్ట్రంలోని పలు ఫార్మసీ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. సదస్సు భాగంగా నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో నిర్మల ఫార్మసీ కళాశాల బి. ఫార్మసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు టి. లక్ష్మీ నారాయణ, టి. జశ్వంత్‌లు తృతీయ బహుమతి సాధించారు. ఫార్మాస్యూటికల్ సైన్స్‌లో కృత్రిమ మేధస్సు వినియోగంపై వారు సమర్పించిన ప్రాజెక్టు న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఓ కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి విద్యార్థులను అభినందిస్తూ, జాతీయ స్థాయి వేదికలపై మరింత చురుకుగా పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి విజేతలను అభినందించి, వారికి మార్గనిర్దేశం చేసిన డా. యు. స్పందన, డా. పి. లక్ష్మయ్యలను ప్రశంసించారు. కళాశాల సిబ్బంది విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

## సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు అప్సా అధ్యక్షులు రామకృష్ణ శుభాకాంక్షలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన కె. విజయానంద్‌కు ఆంధ్రప్రదేశ్ సచివాలయం సంఘం అధ్యక్షుడు జి. రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, పరిపాలనలో విశాల అనుభవం కలిగిన విజయానంద్ ముఖ్యమంత్రి కార్యాలయ పనితీరును మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా వ్యవస్థ బలోపేతం, ప్రజలకు వేగవంతమైన సేవలందించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. సచివాలయం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. విజయానంద్ నాయకత్వంలో పరిపాలన మరింత పారదర్శకంగా, సమర్థంగా కొనసాగుతుందని నమ్మకం వ్యక్తం చేశారు

## భిన్నత్వంలో ఏకత్వం చాటడం భారతీయ సంస్కృతికి నిదర్శనం : ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** భిన్నత్వంలో ఏకత్వం పాటించే భారతీయ సంస్కృతిలో అన్నిమత సంప్రదాయాలను గౌరవించుకోవడం తెనాలి ప్రాంతంలో ఆనవాయితీగా కొనసాగుతుందని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన తెలుగుయువత పట్టణ విభాగాన్ని,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. స్థానిక నందులపేట 3,4వార్డుల పరిదిలో, పట్టణ తెలుగుయువత అధ్యక్షులు కొల్లూరు శ్రీధర్ ఆధ్వర్యంలో, రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లీమ్ సోదరులకు సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిధిగా, జిల్లా పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు ఆత్మీయ అతిధిగా పాల్గొని, ముస్లీమ్ సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ విందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పుట్టి అన్వేష్, కొసరాజు సన్ని, గవిని దినేష్, రావి కార్తీక్, వేమూరు గౌతమ్, నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీవి రౌండ్ టేబుల్ డ్రామాలు : మంత్రి సవిత ఫైర్

- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిలిచిపోవడానికి ప్రధాన కారణం జగనే..
- ఆనాడే ఇదే విషయమై వైసీపీ శ్రేణులు నిలదీయాల్సింది...
- రాయలసీమ ద్రోహి జగన్..
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు రమ్మంటున్నా జగన్ బ్యాచ్ రావడం లేదు..
- సభ నుంచి భయపడి పారిపోతున్నారు
- సీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రేయింబవళ్ల కృషి : మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి (జర్నలిస్ట్ ఫైల్):** 'కమిషన్ల పేరుతో దోచుకోవడానికే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి జగన్ తెర తీశాడు... ఎన్జీటీ అడ్డుకోవడంతో ఆ కుట్ర విఫలమైంది... 2020 అక్టోబర్ లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిలిపేయాలంటూ ఎన్జీటీ స్టే ఇస్తే, ఆ తరవాత మూడేళ్ల పాటు అధికారంలో ఉన్న జగన్ ఆ ప్రాజెక్టు గురించి ఎందుకు పట్టించుకోలేదు.... ఇదే విషయమై ఆనాడే జగన్ ను వైసీపీ శ్రేణులు నిలదీసి ఉంటే... రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయ్యి ఉండేది..' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిలిచిపోవడానికి ముమ్మాటికీ జగనే కారణమని, రౌండ్ టేబుళ్ల సమావేశాలంటూ ఇప్పుడు వైసీపీ శ్రేణులు చేస్తున్నదంతా డ్రామాలేనని విమర్శించారు. రాయలసీమను అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండేలా సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పేరుతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు డ్రామాలు ఆడుతున్నారన్నారు. వారి రౌండ్ టేబుళ్ల సమావేశాల డ్రామాలు ప్రజలు గుర్తించారని, వైసీపీ కుట్రలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని అన్నారు. కమిషన్ల కక్కుర్తి కోసం ఎటువంటి అనుమతులు లేకున్నా, రాయలసీమ ఎత్తిపోతల పథకానికి తన హయాంలో జగన్ ప్రారంభానికి సిద్ధమయ్యారన్నారు. తెలంగాణాలో అధికారంలో ఉన్న ఆనాటి బీఆర్ఎస్ నాయకులు ఎన్జీటీకి వెళ్లడంతో, ఎత్తిపోతల పథకానికి కోర్టు అడ్డు చెబుతూ, ప్రాజెక్టు పనులు నిలిపేయాలని 2020న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఎక్కడవక్కడ నిలిచిపోయాయన్నారు. కోర్టు ఉత్తర్వుల తరవాత జగన్... రాష్ట్రంలో మరో మూడేళ్లు అధికారంలో ఉన్నారన్నారు. కనీసం ఆయన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదని మంత్రి సవిత విమర్శించారు.

**ఆనాడే జగన్ ను నిలదీసి ఉండాల్సింది...**

జగన్ అవినీతి, అసమర్థ నిర్ణయాల వల్ల రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిలిచిపోయిందన్న విషయం అందరికీ తెలిసిందేనని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇదే విషయమై ఆనాడే జగన్ ను రాయలసీమ ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకులు నిలదీయాల్సి ఉండాల్సిందన్నారు. జగన్ తీరుతో రాయలసీమ ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆనాడు పట్టించుకోవడం మానేసి, ఇప్పుడు రౌండ్ టేబుల్ సమావేశాలంటూ డ్రామాలు ఆడుతున్నారన్నారు. వైసీపీ నాయకుల చేష్టలను ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. జగన్ రాయలసీమ ద్రోహి అని మంత్రి సవిత తీవ్రంగా మండిపడ్డారు. ప్రస్తుతం రాయలసీమకు తాగు, సాగునీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. వైసీపీ నాయకుల పొలాలకు నీరు వస్తుందంటే అది కూడా సీఎం చంద్రబాబు చలవేనని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**సీఎం చంద్రబాబుతోనే రాయలసీమ అభివృద్ధి...**

రాయలసీమను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా 2014-19 మధ్య రాయలసీమ తాగు, సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ. 12,441 కోట్లు వెచ్చించారని మంత్రి సవిత గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ... అయిదేళ్లలో కేవలం రూ. 2,011 కోట్లు మాత్రమే ఖర్చు చేశాడన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, రాయలసీమ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూ. 3,870 కోట్లతో హంద్రీ-నీవా కాలువను అభివృద్ధి కుప్పం వరకూ సాగు నీరందించామన్నారు. రాయలసీమను హార్టీకల్చర్, పారిశ్రామిక, పర్యాటక హబ్ గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల్లో అత్యధిక శాతం ఏపీకే తరలొస్తున్నాయన్నారు. ఇందుకు కారణం సీఎం చంద్రబాబు విజనేనని మంత్రి సవిత కొనియాడారు.

**చర్చకు భయపడి పారిపోతున్న వైసీపీ**

ప్రజా సమస్యలపై చర్చకు రావాలని సవాల్ విసురుతున్నా జగన్ గాని, ఆయన పార్టీ నేతలు పట్టించుకోవడం లేదని మంత్రి సవిత మండిపడ్డారు.

వైసీపీ అయిదేళ్ల కాలంలో జరగని అభివృద్ధి కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలల కాలంలో చేపట్టామని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అసెంబ్లీకి రావాలని, పద్ధతిగా మీకు రావాల్సిన సమయం కేటాయిస్తామని చెప్పినా వైసీపీ నేతలు శాసనసభకు రావటంలేదన్నారు. శాసనమండలికి వస్తున్నా సభ జరగనీయకుండా, క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పినా, భయపడి సభ నుంచి పారిపోతున్నారని వైసీపీ ఎమ్మెల్సీలపై మంత్రి మండిపడ్డారు. 2026-27 నూతన బడ్జెట్ లో బీసీలకు అధిక ప్రాధాన్యం కలిగించేలా కేటాయింపులు చేశారన్నారు. తమది బీసీల పక్షపాతి ప్రభుత్వమని మంత్రి సవిత స్పష్టం చేశారు.

## నేడు సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో మహాధర్నాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యారంగ, ఉపాధ్యాయ, ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో నేడు (మార్చి 3న) జిల్లా కేంద్రాల్లో మహా ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయ రాజు, ఎస్. చిరంజీవి తెలిపారు.

విద్యారంగంలో ప్రధానంగా బోధనకు స్వేచ్ఛ కల్పించాలని, ఆయా యాజమాన్యాలకు సంబంధించిన సర్వీస్ రూల్స్ ను నిర్దిష్టంగా రూపొందించాలని వివిధ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరములు గడుస్తున్న నేటికీ 12వ పిఆర్సి కమిషన్ కూడా నియమించకపోవడం దారుణమన్నారు. తక్షణమే కమిషన్ ను నియమించి 30% ఐ.ఆర్ ను మంజూరు చేయాలని, 57 మెమో ను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న నాలుగు కొత్త డీఏలను పాత డీ. ఏ బకాయిలను, రిటైర్డ్ కాబడిన వారికి గ్రాట్యుటీ మంజూరు చేయాలని, ఈ.ఎల్ ఎన్కాష్మెంట్ మంజూరు చేయాలని, పంచాయతీరాజ్ యాజమాన్యంలో మరణించిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, ఇన్ - సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపుకై తగు చర్యలు తీసుకోవాలని, అన్ని యాజమాన్యాలలోని ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, ఎం టి ఎస్, కేజీబీవీ, ఎయిడెడ్, మున్సిపల్ మోడల్ స్కూల్స్, గురుకులాల, సొసైటీస్ తదితర టీచర్ల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రాల్లో మహా ధర్నాలను నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యారంగ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# 20 నెలల్లో రూ.400 కోట్లతో గుంటూరు నగర అభివృద్ధి

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని వెల్లడి
- నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి
- కాల్వలు, రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో కల్పించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి , కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర , శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ తో కలిసి నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల పురోగతి, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల నాణ్యత పర్యవేక్షణకు సిటిజన్ చార్టర్ ద్వారా ప్రజలను బాగస్వామ్యం చేసే విధానం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ప్రధాన రహదారుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వరమే పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం నగర ప్రధాన రహదారుల విస్తరణ, కాలువల నిర్మాణ పనులు రానున్న రెండు నెలల్లో పూర్తి చేయాలని అప్పటి వరకు నూతన పనులు ప్రారంభించవద్దన్నారు. పనుల పురోగతిపై జరిగిన సమీక్షలు కేంద్రమంత్రి అధికారులకు సూచనలు ఇస్తూ శంకర్ విలాస్ ఆర్వోబి పనులు వేగవంతం చేయాలని, పెండింగ్ ల ఉన్న. భూసేకరణను పూర్తి చేయాలన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3 పనులు నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్ల పనులు సజావుగా నిర్వహించుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి రిజర్వాయర్ల మరమత్తు పనులు నిర్వహించాలని, అమృత్ 2.0 మంజూరు చేసిన మంచినీటి రిజర్వాయర్ల పనులు, గోరంట్ల రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీవీకే నాయుడు మార్కెట్, మానస సరోవరం, నల్లపాడు చెరువు పీపీపీ విధానంలో అభివృద్ధికి ఎపిటీఐసీఓ అధికారులు వెంటనే డిపిఆర్ అందించాలన్నారు. నగరంలో పూర్తిస్థాయిలో పారిశుధ్య నిర్వహణతో పాటు, ఈ - ఆటో లు, ఇతర ట్రాక్టర్లు, డంపర్ బిన్ లు అవసరం మేరకు సమకూర్చుకోవాలన్నారు. నగరపాలక సంస్థ లో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన గ్లౌజులు ఇతర రక్షణ సామగ్రి ని అందించాలన్నారు. మే చివరినాటికి ప్రధాన, అంతర్గత డ్రైయిన్లు క్లీనింగ్ పూర్తి చేయాలన్నారు. నగరంలోని రహదారులపై పాట్ హోల్స్ మరమ్మత్తులు నిరంతరం నిర్వహించాలన్నారు. నగరంలోని పార్కులను స్థానిక వాకర్సు తో అసోసియేషన్ లను ఏర్పాటు చేసి వారితో నిర్వహణ చేసేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. హిందూ కళాశాల సెంటర్, బృందావన్ గార్డెన్స్, బొంగరాలబీడు రోడ్డు రహదారి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా పనులు నిర్వహించాలన్నారు. నగరంలో ఆర్ అండ్ బీ నుంచి నగరపాలక సంస్థ కు బదిలీ అయిన రహదారుల్లో ప్రతి ఆరునెలలకు ఒక రహదారిని సిమెంట్ రోడ్డు గా అభివృద్ధి చేయాలన్నారు. వీధిదీపాలు నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీధి కుక్కలకు వాక్సినేషన్ తో పాటు, ఎబిసి ఆపరేషన్లు ప్రస్తుతం సిద్ధం చేస్తున్న సెంటరుతో పాటు, మరో రెండు సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డా పెమ్మసాని చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన 20 నెలల్లో దాదాపు రూ. 400 కోట్ల విలువైన పనులను గుంటూరు పరిధిలో చేపట్టామన్నారు. అందులో ముఖ్యంగా 20 అంశాలపై సమీక్ష నిర్వహించామని. పనులు పురోగతి పై అధికారులతో సమీక్షించి మరింత వేగవంతం అయ్యేందుకు సూచనలు అందించామన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబి ల్యాండ్ అక్విజేషన్ కు రాని, 20 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ - 3 ఈ సంవత్సరం చివరకు పూర్తి చేయాలని సూచించామని, నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం కొన్నాళ్లుగా పనులు పెండింగ్లో ఉండగా, టెండర్ పిలిచామని,పనులు వేగవంతం జరిగేలా చర్చించడం జరిగిందన్నారు. శానిటేషన్, వాటర్ సప్లై కి సంబంధించి సమస్యలపై చర్చించామని, శానిటరీ వర్కర్లకు కావలసిన టాయిలెట్స్, సౌకర్యాలపై వసతులు కల్పించాలని కమిషనర్ గారికి వివరించామన్నారు. రోడ్లపై ఎక్కడ పెడితే అక్కడ డ్రైన్లలో వ్యర్థాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాము. గ్రీనరీ, ఎవెన్యూ ప్లాంటేషన్, పార్కుల నిర్వహణ తదితర అంశాలపై కాంట్రాక్ట్ ను మాడిఫైడ్ చేయాలి అని చర్చించామన్నారు. గుంటూరు నగర పరిధిలోని పలు ప్రధాన రహదారులలో ఇరువైపులా విస్తరణ నిమిత్తం డెమోలిష్ పనులు సగంలో ఆగాయి. ఆ పనులను త్వరగా పూర్తిచేసి వ్యాపారులకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు . ఆ పనులు త్వరగా పూర్తయిన తర్వాతే కొత్త టెండర్లు పిలవాలని చెప్పామని. ఆయా పనుల నిమిత్తం ప్రజలకు ఎకౌంటబిలిటీ ఉండే విధంగా కమిటీలను నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామన్నారు..రాబోయే 1-2 సంవత్సరాల్లో గుంటూరును అభివృద్ధి పథంలో నడిపించి మరింత వేగవంతంగా పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. జి ఎం సి కి బాధ్యతలు నూతనంగా స్వీకరించిన కమిషనర్ మయూర్ అశోక్ గారు చాలా ఫాస్ట్ గా పనులు పూర్తయ్యేలా చూస్తున్నారని ప్రశంసించారు.

పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గల్లా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న కార్పొరేషన్ పనులపై చర్చించామన్నారు. ఏవైతే ఆగిన పనులు ఉన్నాయో వాటన్నింటినీ త్వరగా పూర్తిచేయాలని అధికారులకు తెలిపామన్నారు. పీవీకే నాయుడు మార్కెట్, నార్ల ఆడిటోరియం, కుక్కల బెడద వంటి పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టాలని తెలిపామన్నారు.

తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న అనేక పనులను గడిచిన 18 నెలల్లో పూర్తిచేసేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి రాబోయే సంవత్సరంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మానస సరోవర్ పార్క్ అభివృద్ధి నిమిత్తం కూడా ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి ప్రయత్నిస్తున్నారని, .కనీస నిర్వహణ కూడా లేకుండా ఇబ్బందుల్లో ఉన్న పార్కుల నిర్వహణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చామన్నారు. నగరపాల సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ శంకర విలాస్ ఆర్ఓబికి పెండింగ్ లో ఉన్న భూసేకరణకు షాపు యజమాను సహకరించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం భూములు ఇచ్చినవారికి మెరుగైన పరిహారం అందిస్తున్నామన్నారు. నగరంలో పర్యాటక అభివృద్ధికి దీర్ఘకాలికంగా అభివృద్ధికి నోచుకోని మానవ సరోవరం పీపీపీ పద్ధతిలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో నగరం నుంచి జాతీయ రహదారికి అనుసంధాన రహదారులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో అభివృద్ధి పనులు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో విధులు మంజూరు చేస్తున్నామని, నగరంలో జరిగిన రూ. 400 కోట్ల పనులలో ఇప్పటికే దాదాపు రూ. 310 కోట్లు చెల్లించారని, మిగిలిన నగదును దశలవారీగా చెల్లిస్తున్నారన్నారు. నగర అభివృద్ధిపై కేంద్ర మంత్రి నిరంతరం సమీక్షలు జరుపుతూ అధికారులకు మార్గ నిర్దేశం చేస్తున్నారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కేంద్రమంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు సూచనలు పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగైన చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం నాటికి నగరంలోనికి డ్రైయిన్లు పూడికతీత పనులు పూర్తి చేయటం జరుగుతుందన్నారు. పుర సేవలోను, పీజీఆర్ఎస్ లో అందించిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ ఎస్ కే ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, నగరపాలక సంస్థ ఎస్ఈ జి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467